# పసి మనసు

## పల్లి ఉమాప్రసాద్

ఇంటిముందు స్కూటర్ స్టాండ్ వేస్తున్న నాకు బిక్కమొగమేసుకొని గేటు ముందే కూర్చున్న మనీష్ కనిపించాడు.

''ఏమైంది కన్నా'' అడిగాను మనీష్ చెయ్యి పట్టుకొని పైకి లేపుతూ.

''మరేమో అమ్మ కొట్టింది నాన్నా'' ఎంతసేపటి నుండో ఆపుకున్న దుఃఖం ఉబికివస్తుండగా భోరుమని ఏడుస్తూ నా కాళ్ళని చుట్టేశాడు మనీష్.

బెల్టుతో కొట్టిన దెబ్బలు చేతులమీద కాళ్ళమీద ప్రస్ఫుటంగా కనిపించాయి. వాటిని చూసిన నాకు సింధు మీద కోపం పీకలవరకూ వచ్చింది. అయినా తమాయించుకొని వాడ్ని పైకి లేపి గుండెలకు అదుముకొని లోపలకి తీసుకెళ్ళాను.

''మీరిలా చేసే గారాబం వల్లనే వాడిలా తయారవుతున్నాడు. ఇక చాలు వాడ్ని కిందకు దించండి'' నా చేతిలో వున్న మనీష్‌ను చూస్తూనే అంతెత్తున ఎగిరిపడింది సింధు.

నేను మౌనంగా లోపలికి నడిచాను. నా వెనకాలే చరచరా గదిలోకి వచ్చింది సింధు.

''ఈరోజు మనీష్ ఏం చేశాడో తెలుసా మీకు? వీడి క్రికెట్ బ్యాట్‌తో కిరణ్ ఆడుకుంటూంటే వాడిదగ్గర లాక్కొని, ఆ బ్యాట్‌తో ఎడాపెడా బాదేశాడు. సంవత్సరమైనా లేని కిరణ్ కొట్టడాన్కి చేతులెలా వచ్చాయి వీడికి. ఆరేళ్ళు వచ్చాయి. పెద్దవాడయ్యాడు. చెప్పిన మాట ఒక్కటికూడా వినడు'' ఇలా మనీష్ మీద ఫిర్యాదుల పరంపర కొనసాగుతూనే వుంది. ఆఫీసు నుండి అప్పుడే వచ్చిన నాకు సింధు మాటలకు ఒక్కసారిగా ఆవేశం వచ్చింది.. ''అమ్మ చెప్పేవన్నీ చేశావా'' అడిగాను మనీష్‌ను కోపంగా చూస్తూ.

''అవును మరి. ఆ బ్యాట్ నాకోసం కొన్నారు కదా నాన్నా, మరి తమ్ముడు దానిని పాడుచేస్తూంటే నేనెందుకు వూరుకుంటాను. అందుకే కొట్టాను'' కసిగా పలికాడు మనీష్. కిరణ్‌మీద వాడి ముఖంలో ప్రతిఫలించిన ద్వేషభావానికి కంగుతిన్నాను.

''కిరణ్ అంటే ఎందుకు వీడింత మండిపడుతున్నాడు. ఏమైనా మనీష్‌ను ఒక కంట జాగ్రత్తగా కనిపెట్టాలి. అయినా ఇంత చిన్నవయస్సులో అంత ఈర్ష్య వీడి మనసులోకి ఎలా ప్రవేశించింది'' అనుకుంటూ–

''చూడు మనీష్, తమ్ముడు నీకన్నా చిన్నపిల్లాడు కదా, నెమ్మదిగా తీసుకోవాలిగాని అలా కొట్టకూడదు, అమ్మతో ఇంకెప్పుడూ ఇలా చేయనని చెప్పు'' అంటూ వాడితో సింధుకు సారీ చెప్పించి వాడ్ని బయటకు పంపేశాను.

''ఒక గంటకు మళ్ళీ మామూలే! ఎంతకొట్టినా వీడైతే మారట్లేదు. ఎందుకో కిరణ్ అంటే అస్సలు పడట్లేదు వీడికి. మీ గారాబం వల్లనే వాడిలా తయారవుతున్నాడు'' విసుక్కుంటూ వంటగదిలోకి వెళ్ళిపోయింది సింధు.

• • •

హాలులో క్రికెట్‌మ్యాచ్ చూస్తున్న నాకు 'కెవ్వు'మన్న కిరణ్ గొంతువిని కంగారుగా బెడ్‌రూమ్‌లోకి పరుగుతీశాను. కిరణ్ గుక్కపెట్టి ఏడుస్తుండడం, మనీష్ హడావిడిగా బయటకెళ్ళడం నాకంట పడింది.

'మళ్ళీ ఏం ఘనకార్యం చేశాడో' అనుకుంటూ కిరణ్ దగ్గరకెళ్ళి వాడ్ని చూస్తూనే అదిరిపడ్డాను. కిరణ్ ఎడమ చేతిమీద రక్తంకారేలా కొరికిన పంటిగాట్లు కనబడ్డాయి.

''ఎందుకిలా కిరణ్ అంటే అస్సలు ఇష్టముండట్లేదు వీడికి, ఎలా మార్చాలి వీడ్ని'' అని బాధపడ్తూ, కిరణ్ చేతికి ఫస్ట్ ఎయిడ్ చేసి చేతికి బ్యాండేజి వేస్తూండగానే పేరంటానికి వెళ్ళిన సింధు తిరిగిరావడం కిరణ్ చేతికున్న బ్యాండేజి చూడడం జరిగింది.

''ఏమైందండీ'' కిరణ్ చేతిని తన చేతిలోకి తీసుకొని, కంగారుగా అడిగింది సింధు.

''ఏమీ లేదులే సింధు, పిల్లలిద్దరూ ఆడుకుంటూంటే మనీష్ పంటిగాట్లు పడి కొంచెం రక్తం వస్తే కట్టుకట్టాను. అంతే'' సాధ్యమైనంతవరకూ జరిగిన సంఘటనను చిన్నదిగా చెప్పాను.

''ఇలాగే మీ ముద్దుల కొడుకుని వెనకేసుకు రండి. చిన్నదే అయితే ఇంత బాండేజి ఎందుకు వేస్తారు. ఎన్నిసార్లు చెప్పినా వాడికి బుద్ధిరావట్లేదు. వాడేడి?'' మండిపడ్తూ మనీష్ కోసం వెళ్ళింది సింధు.

చేతినొప్పికి కిరణ్ బాగా ఏడుస్తుండటంతో వాడ్ని గుండెలమీద వేసుకొని జోకొడుతూ, వాడ్ని నిద్రపుచ్చుతూ నేను నిద్రలోకి జారుకున్నాను.

పక్కనే ఏడుపు వినబడేసరికి కళ్ళు తెరిచి చూశాను. సింధు వాడ్ని వెదికి తీసుకొచ్చి బాగా కొట్టినట్లుంది. ఎర్రగా కందిపోయిన బుగ్గలతో, వెక్కి వెక్కి ఏడుస్తున్న వాడ్ని చూస్తుంటే మనసంతా భారంగా మారిపోయింది.

''ఎందుకురా తమ్ముడ్ని అంత గట్టిగా కొరికావు'' వాడి ఉద్దేశ్యమేంటో తెలుసుకుందామని లాలనగా దగ్గరకు తీసుకొని అడిగాను.

నాకేమో సమాధానం చెప్పకుండా మౌనంగా నా చెయ్యి విడిపించుకొని బయటకు వెళ్ళిపోతున్న వాడ్ని చూస్తుంటే నా మనసంతా దేవేసినట్లైంది. 'ఎందుకిలా ప్రవర్తిస్తున్నాడు. ఎలా మార్చాలి వీడ్ని' అనేది నాముందు పెద్దసమస్యగా నిల్చింది.

• • •

నావంతు రావడంతో అన్నయ్య దగ్గర ఆరునెలలు గడిపి నాదగ్గరికి వచ్చింది అమ్మ. నాన్న చనిపోయిన తర్వాత నాన్న ఆస్తులతోపాటు అమ్మను కూడా పంచుకున్నాము నేనూ, అన్నయ్య.

నాన్న చనిపోయినా అమ్మకు ఆర్థికంగా ఏ ఇబ్బంది రానివ్వలేదు నాన్న. అంతకుముందు ఆయన చేసిన ఇన్సూరెన్స్ పాలసీలు, పెన్షన్ అంతా కలిసి ప్రస్తుతం అమ్మకు ఆధారంగా వున్నాయి.


చిన్నప్పటినుండి ఎంతో ప్రేమతో పెంచి పెద్దచేసిన అమ్మను అలా పంచుకోవడం నా మనసును ముల్లులా గుచ్చుతున్నా సింధు సహకారం లేకపోవడంతో ఆ ఒప్పందానికి తలవొగ్గక తప్పలేదు.

• • •

నేను అమ్మకోసం కొన్న భక్తిపాటల క్యాసెట్‌ను టేప్ రికార్డర్‌లో వింటున్న అమ్మ నేనాగదిలోకి వెళ్ళటంతో టేప్‌రిక్డార్ ఆఫ్ చేసింది.

''ఏంట్రాకన్నా, ఏంటి విషయాలు'' అంటూ ప్రేమగా అడిగిన అమ్మకు మనీష్ ప్రవర్తన గురించి పూర్తిగా వివరించాను.

''ఇకనుండి వాడ్ని నేను చూసుకుంటానులే నువ్వు వాడి సమస్యను మర్చిపో'' అంటూ అమ్మ హామీ



ఇవ్వడంతో నా మనసుకు కాస్త ఊరట కల్గింది.

అమ్మ వచ్చిన తర్వాత మనీష్ చిన్ని ప్రపంచం నిండా అమ్మే నిండిపోయింది. మనీష్‌ను స్కూలుకు రెడీ చెయ్యడం, స్కూలు నుండి వచ్చిన తర్వాత దగ్గర కూర్చోబెట్టుకొని హోంవర్క్ చేయించడం, రాత్రి భోజనం అయిన తర్వాత తనదగ్గరే పడుకోబెట్టుకొని కథలు చెప్పడం. ఈవిధంగా వాడి దినచర్య అంతా అమ్మతోనే పెనవేసుకుపోయింది.

• • •

ఒక నెల ఉండగానే అమ్మ ప్రయాణం గూర్చి సింధు రోజూ గుర్తుచేస్తూండేసరికి, ఒక వారం ముందుగానే అమ్మకి టికెట్స్ రిజర్వ్ చేయించాను అన్నయ్య వాళ్ళుండే వైజాగ్‌కి.

అమ్మ అన్నయ్య దగ్గరకు వెళ్ళేరోజు రానే వచ్చింది. అమ్మ వున్న ఆరునెలలూ మనీష్, అసలు కిరణ్ జోలికే వెళ్ళలేదు.

అమ్మ వాడ్ని అంతలా ఎలా మార్చిందో తెలుసుకుందామని అమ్మ గదికి వెళ్ళాను. అదే విషయం అడిగాను అమ్మను.

''నువ్వు మనీష్ గురించి చెప్పిన సమస్యను నేనస్సలు పట్టించుకోలేదురా కన్నా, కాస్త ప్రేమగా దగ్గరకు తీసుకున్నానంతే'' ప్రశాంత వదనంతో చెప్పింది అమ్మ.

''అయితే మేం వాడ్ని అంతకుముందు ప్రేమగా చూడలేదామ్మా''

''అది మనీష్ మాటల్లోనే విను'' అంటూ టేప్‌రికార్డర్ ఆన్ చేసింది అమ్మ.

''నానమ్మా నువ్వూ నాతోనే ఉండిపోవూ'' అభ్యర్ధనగా అడుగుతున్నాడు మనీష్.

''ఎందుకురా చిన్నా'' ఆప్యాయంగా అడుగుతుంది అమ్మ.

''నువ్వంటే నాకు చాలా ఇష్టం నానమ్మా, నువ్వు వెళ్ళిపోతే నన్నెవ్వరూ పట్టించుకోరు. నాన్నేమో పొద్దున్నే ఆఫీసుకెళ్ళి సాయంత్రం వస్తారు. అమ్మకేమో తమ్ముడంటేనే ఇష్టం. వాడెంత గొడవ చేసినా ఏమీ అనదు.

నేను మాత్రం ఏ గొడవ చేసినా 'పెద్దోడికి బుద్ధిలేదని' బాగా కొడుతుంది అమ్మ. నువ్వు నన్నెప్పుడూ కొట్టవు... ఎంచక్కా మంచి మంచి కథలు చెబుతావు. అందుకే నువ్వంటే నాకు చాలా.. చాలా ఇష్టం నాన్నమ్మా. ప్లీజ్, నానమ్మా, నాతో వుండవూ'' బతిమలాడ్తూ అడుగుతున్న మనీష్ గొంతును వింటూనే నా హృదయమంతా జాలితో నిండిపోయింది.

అమ్మ సమాధానం ఏం చెప్తుంది? అల్లారుముద్దుగా పెంచుకున్న మేమే, ఆమెను పంచుకున్నాము. నాకూ ఇద్దరు పిల్లలే. ఒకవేళ నాకు కూడా ఇదే పరిస్థితి ఎదురవుతుందా?

నా పక్కన ఎపుడు వచ్చి కూర్చొందో అమ్మ నేను గుర్తించలేదు కాని ఆమె అనునయంగా వేసిన చేతి స్పర్శకు ఈ లోకంలోకి వచ్చాను మళ్ళీ.

''చూడు కన్నా, నువ్వు ఇద్దరి పిల్లల మధ్య పాటించిన దూరం వల్ల నీ భార్య, పిల్లల ఆరోగ్యం బాగుంది. అది నాణేనికి ఒక వైపు మాత్రమే. వేరొక వైపు నువ్వు గమనించకపోవడం వల్లే మనీష్ ప్రవర్తనలో అంత మార్పు వచ్చింది'' చెప్పింది అమ్మ.

''అంటే'' అయోమయంగా అమ్మవైపు చూశాను.

''ఐదు సంవత్సరాలపాటు మీ ప్రేమను ఒక్కడే అనుభవించిన పసివానికి అకస్మాత్తుగా తన తల్లిదండ్రులు తమ ప్రేమను వేరే పాప మీద చూపేసరికి ఆ పసివానికి తన తమ్ముడి పట్ల తీవ్రమైన ద్వేషం ఏర్పడింది. దాంతో కిరణ్‌ను కొట్టడం ద్వారా, బాధపెట్టడం ద్వారా తన ద్వేషాన్ని బయటపెట్టసాగాడు మనీష్. అదే సమయంలో నేను నా ప్రేమను వాడికి అందించేసరికి కిరణ్‌పట్ల తన ద్వేషాన్ని మర్చిపోయి, మీద్వారా తను కోల్పోయిన ప్రేమను నాదగ్గర అందుకున్నాడు'' అంటూ ముగించింది అమ్మ.

''నానమ్మా'' అని పిలుస్తూ ఆ గదిలోకి వచ్చాడు అప్పుడే స్కూలు నుండి వచ్చిన మనీష్.

''నన్ను క్షమించండి అత్తయ్యా, ఇంతకాలం ఈ విషయాన్ని గుర్తించక వీడ్ని గొడ్డును బాదినట్టు బాదాను'' అంటూ రూంలోకి వచ్చింది అప్పటివరకూ మా మాటలను హాల్లోంచి విన్న సింధు.

అన్ని రోజులూ వాడి మనసును తెలుసుకోకుండా వాడ్ని బాధపెట్టినందుకు గిల్టీగా ఫీలవుతూ ఎడాపెడా ముద్దులు పెట్టేస్తున్న సింధును చూస్తూనే మనీష్ ముఖం సంతోషంతో మతాబులా వెలిగిపోయింది.

★